

శతశాతమే లక్ష్యంగా..

ఉమ్మడి జిల్లాలోని కేఎంసీ, మున్సిపాలిటీల్లో వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. 10లో



అమృత్.. మరింత ఆలస్యం

జిల్లాలోని మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు 'అమృత్' ద్వారా చేపట్టిన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం 36° / 17°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయి. రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది.

మహా కుంభమేళాకు వెళ్లొచ్చాం..

ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలిన భక్తులు

- కుటుంబాలు, కాలనీల వారీగా పయనం
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలపై ఆసక్తి
- ఇతర పుణ్యక్షేత్రాల సందర్శన కూడా..

ఖగోళశాస్త్రం ప్రకారం సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి నిర్దిష్ట రాశిలోకి వచ్చిన సమయాన కుంభమేళా జరుగుతుంది. ఇలా 144 ఏళ్లకోసారి జరిగే మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో గతనెల 13న ప్రారంభమైన మేళా ఈనెల 26న మహా శివరాత్రి వరకు కొనసాగనుంది. ఈ కుంభమేళాలో కోట్లాది మంది హిందువులు పాల్గొని అక్కడి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఈ మేరకు రైల్వేశాఖ దేశ నలుమూలల నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటుచేయగా.. జిల్లా వాసులు కొందరు రైళ్లలో, మరి కొందరు బస్సులు, కార్లు ఇతర వాహనాల్లో సమూహాలుగా వెళ్తున్నారు. ఖమ్మం నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ 1,226 కి.మీ. దూరంలో ఉండగా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మీదుగా ఓ మార్గం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మీదుగా ఇంకో మార్గంలో వెళ్లి వస్తున్నారు.

– ఖమ్మంగాంధీచౌక్



నదీ హారతి ఇస్తున్న దంపతులు



జబల్‌పూర్ వద్ద ఖమ్మం వాసులు





ప్రయాగ్‌రాజ్‌లో టెంట్లు

ఐదు నుంచి ఏడు రోజులు..

మహా కుంభమేళా యాత్ర పర్యటన ఐదు నుంచి ఏడు రోజుల పాటు కొనసాగుతోంది. కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించాక సమీపంలోని అయోధ్య, నైమిశారణ్యం, కాశీ వంటి క్షేత్రాలను సందర్శిస్తున్నారు. మౌని అమావాస్య, రథసప్తమి, పౌర్ణమి వంటి రోజుల్లో వెళ్లిన వారి యాత్ర అక్కడ రద్దీ కారణంగా మరో ఒకటి, రెండు రోజులు పెరిగింది.

స్లీపర్ బస్సులు..

కుంభమేళాకు పలువురు రైలు మార్గం ఎంచుకుంటుండగా.. ఇంకొందరు బస్సులు, కార్లలో వెళ్తున్నారు. మార్గమధ్యలో క్షేత్రాలను చూడొచ్చని, అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకోవచ్చనే భావనతో వాహనాలను ఎంచుకుంటున్నామని చెబుతున్నారు. ట్రావెల్స్ నిర్వాహకులు స్లీపర్‌తో పాటు సీటింగ్ బస్సులను సమకూరుస్తున్నారు. ఒక్కో బస్సులో 20 నుంచి 30 వరకు స్లీపర్ బెర్త్‌లు ఉంటున్నాయి. కాగా, సీటింగ్‌తో కూడిన బస్సులో ఒక్కొక్కరికి రూ.15,500, స్లీపర్ బెర్త్‌లు ఉంటే రూ.17,500 చొప్పున చార్జి చేస్తున్నారు. అయోధ్య, కాశీ వంటి ప్రాంతాలకు సైతం వెళ్లి వస్తే ఈ ధర మరింత పెరుగుతోంది.

అయోధ్య, కాశీకి కూడా..

ప్రయాగ్‌రాజ్ వెళ్తున్న యాత్రికులు అక్కడి నుంచి సుమారు 120 కి.మీ. దూరంలోనే ఉన్న అయోధ్యలో బాలరాముడిని సైతం దర్శించుకుంటున్నారు. అలాగే, 10 వేల ఆలయాలతో పురాతన నగరంగా విరాజిల్లుతున్న కాశీ, అక్కడి అన్నపూర్ణమ్మ ఆలయం, విశాలాక్షి, కాలభైరవ ఆలయాలను, విశ్వేశ్వర జ్యోతిర్లింగాన్ని సైతం దర్శించుకుని తిరుగుముఖం పడుతున్నారు.

మరుపురానిది మహా కుంభమేళా..



మహా కుంభమేళాకు వెళ్లిరావడం ఆనందంగా ఉంది. స్నేహితులంతా కలిసి సమూహంగా వెళ్లాం. అక్కడి ప్రభుత్వం భక్తుల కోసం సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేసింది. మాకు ఎక్కడా ఇబ్బంది కలగలేదు.

– గుమ్మడవెల్లి సంతోష్‌కుమార్, ఖమ్మం

జీవితంలో ఈ అవకాశం రాదు



144 ఏళ్లకోసారి వచ్చే మహా కుంభమేళాకు వెళ్లడం మధురానుభూతి. జీవితంలో మళ్లీ ఈ అవకాశం రాదు. మాఘ పూర్ణిమ రోజున అక్కడ పుణ్యస్నానాలు చేశాం. దేశ, విదేశాల నుంచి ఎందరో వచ్చారు. ఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– పెనుగొండ రజిత భాస్కర్, ఖమ్మం

ప్రత్యేక బస్సులు ఎంచుకుంటున్నారు



కుంభమేళాకు వెళ్లేందుకు పలువురు బస్సులు బుక్ చేసుకున్నారు. స్లీపర్లు, సీటింగ్‌తో కూడిన బస్సులకు డిమాండ్ ఉంది. కుంభమేళాతో పాటు ఇతర యాత్రలకు 5–7రోజులు వెళ్లొస్తున్నారు.

– మిట్టపల్లి శిరీష, ట్రావెల్స్ నిర్వాహకురాలు, ఖమ్మం

న్యూస్‌రీల్

నిత్యకల్యాణం, పల్లకీసేవ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించాక పల్లకీసేవ నిర్వహించగా, రెండు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభం



రిజర్వేషన్ కౌంటర్ వద్ద స్థానికులు

కారేపల్లి: కారేపల్లి రైల్వేస్టేషన్‌లో నాలుగేళ్ల తర్వాత శనివారం రిజర్వేషన్ కౌంటర్‌ను అధికారులు తిరిగి ప్రారంభించారు. కరోనా సమయాన ఇక్కడి రిజర్వేషన్ కౌంటర్‌ను తొలగించడమే కాక పలు రైళ్లను రద్దు చేసిన విషయం విదితమే. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే కారేపల్లి, ఇల్లెందు, కామేపల్లి మండలాల ప్రయాణికులు రిజర్వేషన్ కోసం కొత్తగూడెం, ఖమ్మం, డోర్నకల్ స్టేషన్లకు వెళ్లాల్సి వస్తోంది. ఈనేపథ్యాన రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే కాజీపేట–మణుగూరు, డోర్నకల్–భద్రాచలం రోడ్డు రైళ్లను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

కార్గో కేంద్రాల నిర్వహణకు టెండర్లు

ఖమ్మంమయూరిసెంటర్: మధిర, వైరా, వీ.ఎం.బంజర బస్టాండ్లలో ఆర్టీసీ లాజిస్టిక్స్(కార్గో) సెంటర్ల నిర్వహణకు ఆసక్తి ఉన్న వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు లాజిస్టిక్స్ మేనేజర్ వి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్, ప్రింటర్, వేయింగ్ మిషన్ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు http://tsrtc.telangana.gov.in(tenders) వెబ్‌సైట్ నుంచి టెండర్ దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేశాక ఈనెల 24న ఉదయం 10నుంచి మధ్యాహ్నం రెండు గంటల్లోగా ఖమ్మం పాత బస్టాండ్‌లోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో దాఖలు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9154298582/85 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

1,607 పోలింగ్ స్టేషన్లు ఖరారు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ స్టేషన్లను ఖరారు చేశారు. జిల్లాలో 20 జెడ్పీటీసీ, 287 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 1,607 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు జెడ్పీ సీఈఓ దీక్షారైనా వెల్లడించారు. కాగా, 400మంది లోపు ఓటర్ల కోసం 263, 401 నుంచి 500లోపు ఓటర్లకు 497, 501 నుంచి 750 మంది ఓటర్ల కోసం 847 పోలింగ్ స్టేషన్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు.

ఎదురుచూపులు ఫలించాయి..

డీఎస్సీ–2008 అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు



కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ శర్మ

ఖమ్మం సహకారనగర్: సుదీర్ఘకాలం ఎదురుచూపుల తర్వాత 2008 డీఎస్సీ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఖమ్మం డైట్ కళాశాలలో శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడారు. డీఎస్సీ–2008లో 45మంది అభ్యర్థులకు గాను ముగ్గురు డీఎస్సీ–2024లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. మిగిలిన 42మందిలో ఏడుగురు కౌన్సెలింగ్‌కు గైర్హాజరు కాగా 35మందికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో డీఎల్‌పీఓ రాంబాబు, డీఈఓ కార్యాలయం ఉద్యోగులు శ్రీనివాసరావు, కిషోర్, దేవేందర్, డైట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందే..

- రీ సర్వేతో మరింత పెరగనున్న బీసీల జనాభా
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖమ్మంమయూరిసెంటర్: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతమే రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం కాకుండా జనాభా దామాషా ప్రకారం అమలు చేయాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఖమ్మంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలో బీసీలు 46శాతం ఉన్నారని, రీ సర్వే చేయడంతో మరో రెండుశాతం పెరుగుతుందని చెప్పారు. ఈ మేరకు బీసీల జనాభా దాదాపు 48 శాతం ఉంటే ఏ ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారో చెప్పాలన్నారు. అంతేకాక ఒకే బిల్లు కాకుండా విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లకు వేర్వేరు బిల్లులు పెట్టాలని, ముస్లింలు, బీసీలకు కలిపి మొత్తం 56 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, రిజర్వేషన్ల విషయంలో హిందువులు, ముస్లింల నడుమ బీజేపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. గ్రామాలు, కులాల వారీగా జనాభా, డెడికేటెడ్ కమిషన్ నివేదికను బయట పెట్టాలని, రీ సర్వేపై విస్తృత ప్రచారం చేయాలని ఆమె సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ బీసీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని, అందులో భాగంగానే పార్టీ పదవుల్లో బీసీలకు 51శాతం అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ ఉంటే అభివృద్ధిలో భారత్ ఎప్పుడో అమెరికాను దాటిపోయేదని అభిప్రాయపడ్డారు. కాగా, తెలంగాణ జాగృతి సంస్థ బీసీలకు న్యాయం జరిగేవరకూ పోరాడుతుందని వెల్లడించారు. ఖమ్మంలో బీసీ భవన నిర్మాణం పూర్తికి బాధ్యత తీసుకోవాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కోరారు. అనంతరం ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, వివి ధ సంఘాల నాయకులు మాట్లాడగా ఎంబీసీ నాయకుడు వీరన్న ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎంపీ రవిచంద్ర, నాయకులు హరిప్రియ, గుండాల కృష్ణ తదితరులు



గిరిజన మహిళలతో కలిసి బిందె ఎత్తుకున్న ఎమ్మెల్సీ కవిత

సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో..

ఖమ్మం పాండురంగాపురంలోని సంత్ సేవాలాల్ మందిరం, బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతించగా ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్, హరిప్రియతో కలిసి సంత్‌సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. సేవాలాల్ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం కేసీఆర్ చలువేనని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే, ఇప్పుడు ముగ్గురు మంత్రులు చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు–కార్పొరేటర్ శ్రీవిద్య, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, నాయకుడు గుండాల కృష్ణ నివాసాలకు ఎమ్మెల్సీ కవిత వెళ్లారు. కాగా, ఖమ్మం వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

సంత్ సేవాలాల్ ఆశయాలను సాధిస్తాం..

జయంతి వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: సంత్ సేవాలాల్ ఆశయాల సాధనకు సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రఘునాథపాలెంలోని జింకలతండా క్రాస్‌లో సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా శనివారం ఆలయ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ బంజారాలకు హిందూ ధర్మం బోధించిన సేవాలాల్ సంఘ సంస్కర్తగా నిలిచారన్నారు. జంతుబలులు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా గిరిజనులను చైతన్యపరిచారని తెలిపారు. కాగా, రఘునాథపాలెం మండలంలోని గిరిజనులు ఉద్యాన పంటల సాగుకు చిరునామాగా మారాలని, అందుకు అన్నివిధాలుగా ప్రభుత్వం నుంచి సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు లకావత్ సైదులు, కమర్తపు మురళి, నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బాలసాని లక్ష్మీనారాయణ, సాదు రమేష్‌రెడ్డి, సేవాలాల్ ఆలయ నిర్మాణం, జయంతి ఉత్సవ బాధ్యులు నంద్యాల జగ్గయ్యనాయక్, వాంకుడోత్ దీప్లానాయక్, రాము, రామ్మూర్తి, రాంబాబు, బాలాజీనాయక్, బిచ్చ సాది తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి తుమ్మల

వైరస్ లక్షణాలు ఉంటే సమాచారం ఇవ్వండి

ఖమ్మంవ్యవసాయం: కోళ్లలో వ్యాధులు, వైరస్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు సూచించారు. ఈమేరకు కోళ్లలో వైరస్ లక్షణాలు కనిపిస్తే నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచిస్తూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏదైనా సమాచారం ఇచ్చేందుకు 91007 97300 వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేయగా, కోళ్ల పరిశ్రమల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలోని పశువైద్యాధికారులు కోళ్ల పరిశ్రమలను సందర్శిస్తూ స్థితిగతులను పరిశీలిస్తూ నిర్వాహకులకు సూచనలు చేస్తున్నారు.

తాగునీటి సరఫరాకు 'అమృత మిత్ర'లు

ఖమ్మంలోని ఆరు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్

ఖమ్మంమయూరిసెంటర్: తాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయంలో అడుగు ముందుకు పడింది. ఈ నిర్ణయంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అమృత్ పథకం ద్వారా తాగునీటి సరఫరా బాధ్యతలను ఇకపై స్వయం సహాయక సంఘాల బాధ్యులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈమేరకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా ఆరు ప్రాంతాలను ఎంపిక చేశారు. ప్రాంతాల వారీగా ఒక్కో సంఘానికి అప్పగించి పంపు ఆపరేటర్‌ను అధికారులు కేటాయించారు. సంఘానికి రూ.10లక్షల చొప్పున నిధులు కేటాయించిన నేపథ్యాన ఆయా ప్రాంతాల్లో నల్లాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, పన్నుల వసూలు, లీకేజీల మరమ్మతు బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది.

ఆరు ప్రాంతాలు కేటాయింపు

తొలిదశలో ఖమ్మంలోని కైకొండాయిగూడెం, బాలపేట, సీపీ ఆఫీస్ రోడ్డు, గుట్టలబజార్, శ్రీరామ్ హిల్స్, రోటరీనగర్ ప్రాంతాల ట్యాంక్‌ల పరిధిలో బాధ్యతలను ఎంపిక చేసిన సంఘాలకు అప్పగించారు. ఆయా ట్యాంకుల పరిధిలో మరమ్మతులు చేయించడమే కాక నల్లా పన్నుల వసూళ్ల బాధ్యతలు నిర్వర్తించేలా అవగాహన కల్పించారు. ఈమేరకు ఇటీవల హైదరాబాద్‌లో శిక్షణకు వెళ్లివచ్చిన అధికారులు శనివారం సంఘాల సభ్యులతో సమావేశమై అమృత మిత్రల నియామకం, శిక్షణ, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.



పాలేరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మిర్చి తోటలను వైరస్ ఆశించింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. మళ్లీమళ్లీ మందులు కొట్టినా పెట్టుబడి పెరగడమే తప్ప వైరస్ నుంచి పంటను కాపాడుకోలేక విధిలేని పరిస్థితుల్లో పశువులను మేపుతున్నారు. నియోజకవర్గంలో వందల ఎకరాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. కూసుమంచి మండలం పోచారంలోని ఓ రైతు మిరప తోటలో ఆవులను మేపుతున్న దృశ్యమే ఇది. – ఖమ్మం రూరల్

సొసైటీలు.. మరో ఆరు నెలలు

- డీసీసీబీ, పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు
- డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్‌పై స్పష్టత కరువు



ఖమ్మంవ్యవసాయం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) పునర్నిర్మాణం వరకు ఎన్నికలు జరపొద్దని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువు శనివారంతో ముగియగా.. మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇవే పాలకవర్గాలు ఆగస్టు 15వరకు కొనసాగనున్నాయి. రైతులకు ప్రయోజనం కలిగేలా పెద్ద సహకార సంఘాలను రెండు లేదా మూడుగా విభజించి నూతన సంఘాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే అధికారులు నూతన సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఏపీలో విలీనమైన మండలాల్లోని సంఘాలు కాక పూర్వ ఖమ్మం జిల్లాలో మొత్తం 100 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటిలో ఖమ్మం జిల్లాలో 76, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో రెండేసి సంఘాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యాన పెద్ద సంఘాలను విభజించి ఖమ్మం జిల్లాలో కొత్తగా 47, భద్రాద్రి జిల్లాలో 35 సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘాల సంఖ్య పెరగనుండడంతో ప్రక్రియ పూర్తయ్యాక అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే భావనతో పాత పాలకవర్గాల గడువు పొడిగించినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో పీఏసీఎస్‌లు, డీసీసీబీకి ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలే ఆగస్టు 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ మాటేమిటి?

జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్), మార్క్‌ఫెడ్ పాలకవర్గాల పదవీ కాలంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ రెండు సంస్థల పాలకవర్గాల పదవీ కాలం ఈనెల 28తో ముగియనుంది. ఈ పదవులు కూడా సహకార సంఘాలతో ముడిపడి ఉండడంతో గడువు నాటికి ప్రభుత్వం మరో ఉత్తర్వు విడుదల చేస్తుందా.. లేక ప్రత్యేక అధికారులను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

ఖేలో ఇండియా ఆర్చరీ టోర్నీలో రజతం



పతకం, సర్టిఫికెట్ అందుకుంటున్న అశ్విత్

ఖమ్మంస్పోర్ట్స్: ఖేలో ఇండియా జాతీయస్థాయి టోర్నీలో జిల్లాకు చెందిన కె.అశ్విత్‌దొరకు రజత పతకం దక్కింది. బెంగళూరులో జరిగిన టోర్నీలో ఓపెన్ సీనియర్ పురుషుల విభాగం నుంచి హాజరైన ఆయన రికర్వు ఈవెంట్‌లో ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అశ్విత్‌ను ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాధుల సారంగపాణి, పుట్టా శంకరయ్య, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ నగేశ్ అభినందించారు.

రాష్ట్ర కబడ్డీ జట్టులో జిల్లా క్రీడాకారులు



సిలివేరు పూజిత



కొండ భవాని

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయస్థాయి సీనియర్స్ మహిళల కబడ్డీ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టులో జిల్లాకు చెందిన సిలివేరు పూజిత, కొండా భవానీకి స్థానం దక్కింది. హరియాణాలో శనివారం మొదలైన జాతీయస్థాయి కబడ్డీ టోర్నీలో తెలంగాణ జట్టు తరఫున వీరు పాల్గొంటున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని సత్తా చాటారు. దీంతో పూజిత, భవానీని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్రజట్టుకు ఎంపిక చేయగా, రాష్ట్ర జట్టు కోచ్‌గా జిల్లాకు చెందిన శివజ్యోతి నియమితులయ్యారు. వీరిని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ప్రశంసించారు.

సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు ప్రారంభం

ఖమ్మంసహకారనగర్: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆధ్వర్యాన పదో తరగతి పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు జంబ్లింగ్ విధానంలో పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఈ మేరకు తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పాఠశాలల యాజమాన్యాలు వెల్లడించాయి.

ఘనంగా లూర్దుమాత మహోత్సవం



బిషప్ సగిలి ప్రకాశ్‌తో భక్తులు

తల్లాడ: మండలంలోని నారాయణపురంలో లూర్దుమాత వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లూర్దుమాతా దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా ఖమ్మం పీఠాధిపతి సగిలి ప్రకాశ్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ దేవుడిపై ప్రేమ, భక్తితో ఉండాలని, తోటి మానవుల విషయంలో దయ, సేవాగుణం కనబర్చాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెల్లటూరి అమృత్‌రాజ్, ఫాదర్ అజయ్, మరియన్న, కర్నాటి లక్ష్మారెడ్డి, మూకర ప్రసాద్, చార్లెస్, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ క్వార్టర్స్‌లో ఆర్మీ జవాన్ అప్పగింత

చింతకాని: బోనకల్‌కు చెందిన ఆర్మీ జవాన్ బూదాల మనోజ్‌ను హైదరాబాద్‌లోని ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లో అప్పగించినట్లు వైరా ఏసీపీ రహమాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన విధులకు గైర్హాజరవుతూ కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతుండడంతో అధికారులు వారెంట్ జారీ చేశారని వెల్లడించారు. దీంతో ఖమ్మం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌లోని హెడ్‌క్వార్టర్స్‌లో అప్పగించారని తెలిపారు. గతంలోనూ ఇలాగే విధులకు గైర్హాజరవడంతో ఆర్మీ అధికారులకు అప్పగించగా మళ్లీ పారిపోయి వచ్చాడని వెల్లడించారు. అలాగే,ఓ యువతిని లైంగికంగా వేధించిన కేసు, భార్యను వేధించిన కేసులు ఉన్నాయని తెలిపారు. ఇటీవల నాగులవంచ పెట్రోల్‌బంక్‌లో జరిగిన దాడి ఘటనలో విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మనోజ్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేయగా అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయితే, కేసులో నిష్పక్షపాతంగా విచారణ చేస్తున్నా ఆయన పోలీసులపై అసత్య ఆరోపణలు చేస్తుండడం సరికాదని ఏసీపీ వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	13,900	6,000
మిర్చి తాలు	6,600	5,000
పత్తి	6,900	5,500

– ఖమ్మం వ్యవసాయం

అమృత్.. మరింత ఆలస్యం

- వైరా మున్సిపాలిటీలో మూడు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం
- ఆపై 18 కి.మీ మేర తాగునీటి పైపులైన్ కూడా..
- రూ.26.87 కోట్ల నిధులతో పనులు
- పూర్తవడానికి మరో ఏడాది సమయం



వైరా పాత పంచాయతీ కార్యాలయం వద్ద కొనసాగుతున్న ట్యాంకు నిర్మాణ పనులు

వైరా: మున్సిపాలిటీల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకాన్ని ప్రవేశపెట్టాయి. ఈ పథకం ద్వారా పూర్తిస్థాయిలో తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే, జిల్లాలోని వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రధానంగా మంచి నీటి ట్యాంకుల నిర్మాణం, కొత్త పైపులైన్ల ఏర్పాటుతో పాటుగా ప్రతీ ఇంటికి నల్లాల ఏర్పాటు వంటివి చేపట్టనున్నారు. అయితే, ప్రస్తుతం వేసవి కాలం ముగిసే వరకు కూడా ఈ పనులు పూర్తయ్యేలా లేదు. ప్రధానంగా ట్యాంకుల నిర్మాణానికి అవసరమైన స్థలాల గుర్తింపు ఆలస్యం కావడం మరో వైపు జాతీయ రహదారులు, రైల్వే ట్రాక్‌లు వంటివి పైపు లైన్ల నిర్మాణంలో అడ్డుగా ఉండడంతో నిర్మాణం ఆలస్యమవుతోంది.

వైరా మున్సిపాలిటీలో ఇలా..

వైరా మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులకు గాను సుమారు 37 వేల జనాభా ఉండగా 18 ట్యాంకులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అమృత్ 2.0 పథకం ద్వారా మున్సిపాలిటీలో మరో మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నారు. ఒక్కొక్క ట్యాంకు సామర్థ్యం 9 లక్షల లీటర్లు. వైరా పాత పంచాయతీ కార్యాలయం సమీపాన, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో, మున్సిపాలిటీ పరిధి పల్లిపాడు 17వ వార్డులో వీటి నిర్మాణం చేపట్టనున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో పాత కూరగాయల మార్కెట్ వద్ద మున్సిపల్ శాఖ అధికారులు స్థలం గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేస్తుండడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విలువైన స్థలంలో ట్యాంకు నిర్మాణం చేపడుతుండడంతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కూడా స్థలాన్ని మార్చాలని సూచించి.. ఐబీ గెస్ట్ హౌస్ వెనుక గుట్టపై ప్రతిపాదించారు. ఇక పాత గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో 9 లక్షల లీటర్ల ట్యాంకు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. వీటి నిర్మాణం పూర్తయితే వైరా రిజర్వాయర్ నుంచి సరఫరా అయ్యే మిషన్ భగీరథ మంచి నీటి ట్యాంకు నుంచి ప్రస్తుతం నిర్మాణం చేపట్టనున్న మరో మూడు ట్యాంకులకు నీటిని సరఫరా చేసేందుకు 12 కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంటుంది. మరో వైపు ట్యాంకులో ఎక్కించిన నీటిని ఆయా వార్డులకు సరఫరా చేసేందుకు మరో 18 కిలో మీటర్ల పైపు లైను నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. మొత్తం 30 కిలో మీటర్ల మేర పైపు లైను నిర్మాణ పనులు జరగాల్సి ఉన్నదని అధికారులు అంటున్నారు. గతేడాది ఆగస్టు 9వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. కానీ, పనులు మాత్రం నత్తనడక సాగుతున్నాయి.



వేసేందుకు సిద్ధంగా ఉన్న పైపులు

ఒక్కొక్కరికీ 135 లీటర్ల తాగునీరు

మున్సిపాలిటీల్లో అమృత్ 2.0 పథకం ద్వారా ఒక్కొక్క ఇంటికి 135 లీటర్ల నీటిని సరఫరా చేయనున్నారు. కానీ, ప్రస్తుతం జరిగే పనులు ఆలస్యం కావడంతో మరో ఏడాది పాటు పనులు కొనసాగనున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 1, 2, 3, 4, 7, 8, 9, 10 వార్డులతో పాటు 20వ వార్డుల్లో తాగునీటికి వేసవిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మిషన్ భగీరథ పైపు లైను ద్వారా వచ్చే నీరు పూర్తిస్థాయిలో ఆయా వార్డులకు అందడం లేదు. అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేస్తే కనీసం వచ్చే ఏడాదికి అయినా తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి.

సత్తుపల్లి, మధిరలో..

జిల్లాలోని సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీల్లో కూడా అమృత్ 2.0 పథకం పనులు ప్రారంభమయ్యాయి. సత్తుపల్లిలో 23 వార్డులకు రూ.30 కోట్లు, మధిర మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా సుమారు 39 వేల జనాభాకు రూ.17 కోట్లు మంజూరయ్యాయి. ఆ మున్సిపాలిటీలో కూడా నత్తనడకన పనులు సాగుతున్నాయి. 3 మున్సిపాలిటీల్లో అమృత్ 2.0 పనులు పూర్తయితే తాగునీటి ఇబ్బందులు పూర్తిస్థాయిలో తొలగనున్నాయి.

తాగునీటి సమస్యకు పరిష్కారం

మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు పనులు చకచకా సాగుతున్నాయి. ట్యాంకుల నిర్మాణం పూర్తయితే వైరా మున్సిపాలిటీ పరిధిలో పైపు లైన్ల నిర్మాణం పనులు కూడా ప్రారంభించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– నరేశ్‌రెడ్డి, మున్సిపల్ డీఈ

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



భట్టి విక్రమార్క

మధిర/ముదిగొండ: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురానికి చేరుకోనున్న ఆయన అక్కడ ముఖ్య నేతలతో సమావేశమవుతారు. ఆ తర్వాత గంధసిరి, బాణాపురంతో పాటు మధిరలో జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు.

మంత్రి పొంగులేటి..

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటిస్తారు. ఉదయం 10 గంటలకు కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో మొదలయ్యే మంత్రి పర్యటన ఖమ్మంరూరల్ మండలం రెడ్డిపల్లి, రఘునాథపాలెం మండలం పుఠానితండా, మధిర, ముదిగొండ మండలం గంధసిరి, న్యూలక్ష్మీపురం, ఖమ్మంలో కొనసాగుతుంది.

ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం జిల్లాలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారు. మధిర, ఖమ్మం నియోజకవర్గాల్లో జరిగే కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారని ఆయన క్యాంప్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటాం..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ఖమ్మం జైలు వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు తదితరులు

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బనాయించే అక్రమ కేసులకు భయపడేది లేదని.. అక్రమ కేసులు, అధికారం శాశ్వతంగా ఉండవనే విషయాన్ని గుర్తించాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం రామన్నపేటలోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఇల్లెందుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌ను శనివారం ఆమె ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం జైలు బయట కవిత విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను గ్రామసభలో ఎండగట్టినందుకే సురేందర్‌ను జైలులో పెట్టారని, ఇలాంటివి చేసినా కాంగ్రెస్ హామీలు అమలు, వైఫల్యాలపై నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని, అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. అయితే, కేసీఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం ఎవరికీ సాధ్యం కాదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఏమీ చేయలేదని ప్రజలు గుర్తించడంతో ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. కాగా, బీఆర్ఎస్ శ్రేణులకు అండగా నిలుస్తామని కవిత భరోసా ఇచ్చారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ ఎల్‌సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, మదన్‌లాల్, హరిప్రియ, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, నాయకులు గుండాల కృష్ణ, బొమ్మెర రాంమ్మూర్తి, బి.వేణు, ఉమ, నిరోష తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం..



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధి ఆళ్లపాడు మైనర్ కింద సాగర్ జలాలు అందక పంటలు ఎండిపోతున్నాయని స్థానిక రైతులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం ఆళ్లపాడులోని మొక్కజొన్న పంటను జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారబందీ విధానంతో చివరి భూములకు నీరందక రూ.వేలల్లో పెట్టుబడి పెట్టిన మొక్కజొన్న పంట కంకి దశలో ఎండిపోతోందని పలువురు తెలిపారు. ఈ విషయమై డీఏఓ పుల్లయ్య స్పందిస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అదనంగా కొద్దిరోజులు నీరందించేలా చూస్తామని తెలిపారు. అయితే, పంట వడలినట్లు అనిపిస్తే యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలని, కాంప్లెక్స్ ఎరువులు వేయొద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.విజయచంద్ర, ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

పంట రుణం కింద ఫిక్స్‌డ్ డిపాజిట్ జమ?

బ్యాంకర్లు బెదిరించారని ఫిర్యాదు, అలాంటిదేమీ లేదన్న అధికారులు

నేలకొండపల్లి: పంట రుణం చెల్లించలేదంటూ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్మును జమ చేయించుకున్నారని ఓ వ్యక్తి ఆరోపించాడు. ఈ సందర్భంగా మండలంలోని మోటాపురానికి చెందిన నంబూరి నారాయణ శనివారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఆయన రాజేశ్వరపురంలోని బ్యాంకులో 2021–22లో రూ.55 వేల పంట రుణం తీసుకున్నారు. అయితే, రుణం చెల్లించకపోగా ఆర్థిక ఇబ్బందులతో 2022లో భూమి విక్రయించారు. ఈ నెల వృద్ధాప్య పింఛన్ నగదు కోసం వెళ్తే నిరాకరించడమే కాక అధికారులు పంట రుణం చెల్లించాలని డిమాండ్ చేశారని వాపోయాడు. చివరకు పింఛన్ ఇచ్చినా రుణం చెల్లించాలని చెబుతూ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన రూ.55 వేలు బదలాయించుకున్నారని, ఇందుకోసం బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడి బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నారాయణ శనివారం వెల్లడించారు. ఈ విషయమై ఎస్‌బీఐ మేనేజర్ టి.నాగేందర్‌ను వివరణ కోరగా తాము నారాయణను బలవంతం చేయలేదని, ఆయన ఇష్టపకారమే ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్ము జమ చేసుకున్నట్లు వెల్లడించారు. తాము బెదిరించారని చెప్పటం సరికాదని, పెన్షన్ విషయంలోనూ ఇబ్బంది పెట్టలేదని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి



లెక్చరర్లను ఓటు అభ్యర్థిస్తున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి తాను కృషి చేశానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ – ఖమ్మం – వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన ఆయన శనివారం ఖమ్మంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఖమ్మం మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శాంతినగర్ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులను విరామ సమయంలో కలిసి మాట్లాడారు. ఇప్పటికీ మూడు పర్యాయాలు గెలిచిన ఎమ్మెల్సీలు ఏ సమస్యను పరిష్కరించకపోగా ఇంకా జఠిలం చేసిన విషయాన్ని ఉపాధ్యాయులు, అధ్యాపకులు గుర్తించాలని కోరారు. అయితే, తాను 10,479 భాషా పండిట్ పోస్టులను అప్‌డేట్, టెట్ నిబంధనతో సంబంధం లేకుండా సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ ఇప్పించడానికి కృషి చేశానని వెల్లడించారు. ఈ మేరకు ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే దసరా నాటికి ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన ద్వారా అర్హులైన ఉపాధ్యాయులకు లెక్చరర్లు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓల పదోన్నతులకు అవకాశం కల్పిస్తానని హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌కు మెమో

కామేపల్లి: మండలంలోని రాయిగూడెం–2 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ కమలమ్మ అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవడమే కాక లబ్ధిదారులు రాకున్నా అందరికీ పౌష్టికాహారం అందించినట్లు నమోదు చేయడంతో మెమో జారీ చేసినట్లు సీడీపీఓ దయామణి తెలిపారు. ఈ విషయమై 'ఆయానే అన్నీ' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 9న కథనం ప్రచురితమైంది. దీంతో టీచర్‌కు మెమో జారీ చేశారు. అలాగే, టీచర్‌కు ఐదు రోజులు, ఆయా అవంతికి మూడు రోజుల పాటు వేతనం నిలిపివేయనున్నట్లు సీడీపీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మధిర: మధిరలోని శాంతి థియేటర్ సమీపాన శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మధిర సుందరయ్యనగర్ ఆరో లేన్‌కు చెందిన శ్రీనివాస్ బైక్‌పై వెళ్తూ మధిర నుంచి వైరా వైపు వెళ్లే రోడ్డు నుంచి యూ టర్న్ తీసుకుంటున్నాడు. ఈక్రమాన మరో బైక్‌పై ముగ్గురు వెళ్తూ ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. ఆపై డివైడర్‌ను ఢీకొట్టగా అశోక్, గౌస్ పాషా, రోహన్‌తో పాటు శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

ప్రభుత్వాస్పత్రిలో డీఎంహెచ్‌ఓ తనిఖీ

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రికార్డులు పరిశీలించాక ఆమె ఉద్యోగులతో మాట్లాడారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. అలాగే, వైద్య, ఆరోగ్యశాఖ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వంద శాతం అమలు చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి నవ్యకాంత్, ఉద్యోగులు జి.రామారావు, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న కళావతిబాయి

గిడ్డంగుల సంస్థకు 'స్కోచ్' అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న చైర్మన్ రాయల, ఎండీ లక్ష్మి

ఖమ్మంవ్యవసాయం: లావాదేవీల డిజిటలైజేషన్ అంశంపై ముందంజలో నిలిచిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు స్కోచ్–2024 అవార్డు లభించింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన 100వ స్కోచ్ సమ్మిట్‌లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొర్రా లక్ష్మి అవార్డు అందుకున్నారు.

బోర్డుపై బోధన.. గ్రౌండ్‌లో సాధన

- అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న గణిత ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు
- జాతీయస్థాయిలో స్వర్ణపతకం కైవసం
- 2021లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు



నాగేశ్వరరావుకు బంగారు పతకం అందజేస్తున్న నిర్వాహకులు (ఫైల్)

బూర్గంపాడు: విద్యార్థులకు లెక్కలు చెప్పే మాస్టారు అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపుతున్నాడు. జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.నాగేశ్వరరావు ఇటీవల జాతీయస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్‌లో సత్తా చాటాడు. ఏన్కూర్ మండలం ఒంటిగుడిసె(భీమ్లా తండా)కు చెందిన ఆయన 2008లో ఎస్‌జీటీగా ఎంపికయ్యాడు. కొత్తగూడెం 14 ఏళ్లు పనిచేసిన నాగేశ్వరావు గతేడాది జూన్‌లో ఉద్యోగోన్నతిపై బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరాడు. విద్యార్థులకు సులభ రీతిలో పాఠాలు బోధిస్తూ 2021లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నాడు. చిన్నప్పటి నుంచి మక్కువతో క్రికెట్ సాధన చేస్తున్నాడు. 2024లో తెలంగాణ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో భద్రాద్రి జిల్లాను ద్వితీయస్థానంలో నిలపటంలో కీలక పాత్ర పోషించాడు. రెండేళ్ల నుంచి అథ్లెటిక్స్‌పై కూడా దృష్టి పెట్టాడు. జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో సాధన ప్రారంభించాడు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సాధన చేస్తూ మల్లికార్జున్ అనే క్రీడాకారుడి వద్ద మెలకువలు నేర్చుకున్నాడు. ఆ తర్వాత కోచ్ లేకుండానే యూట్యూబ్‌లో అథ్లెటిక్స్‌ను వీక్షిస్తూ సాధన కొనసాగిస్తున్నట్లు నాగేశ్వరరావు తెలిపాడు.

సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గత జనవరి 31 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు కేరళలో జరిగిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించాడు. డిస్కస్ త్రోలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్, జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. జనవరి 21న జిల్లాస్థాయిలో, 23న రాష్ట్రస్థాయిలో జరిగిన సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్లలో ప్రథమస్థానం సాధించాడు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు చండీఘడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. జాతీయస్థాయి పోటీల్లో కూడా గోల్డ్ మెడల్ సాధిస్తాననే నమ్మకంతో సాధన చేస్తున్నాడు. విద్యార్థులకు లెక్కలు బోధించటంతో పాటు సాయంత్రం ఆటల పీరియడ్‌లో వారికి అథ్లెటిక్స్ నేర్పుతున్నానని నాగేశ్వరరావు తెలిపాడు. స్నేహితుల సూచనలతో అథ్లెటిక్స్‌పై ఆసక్తి పెరిగిందని, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ప్రధానోపాధ్యాయురాలు రవిలా దేవి తనను ప్రోత్సహించారని వెల్లడించాడు.

దాడి కేసులో ఏసీపీ విచారణ

కారేపల్లి: ఇటీవల మండలంలోని గాంధీనగర్ (కోమట్లగూడెం) గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు కాపా చంద్రశేఖర్‌పై వెంకన్న దాడి చేయగా కేసు నమోదైన విషయం విదితమే. కాగా, ఘటనపై ఆదివాసీ అయిన వెంకన్న ఇటీవల ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి శనివారం విచారణ చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఉషారాణి, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. తొలుత ఆయన కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ఎస్.రాజారాం పాల్గొన్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

పెనుబల్లి: అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు వీఎం బంజర్ ఎస్ఐ కె.వెంకటేశ్ తెలిపారు. మండలంలోని ముత్తగూడెం నుంచి టేకులపల్లికి వెళ్లి అక్కడ రెండు మినీ లారీల్లో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని, అనంతరం బియ్యాన్ని సివిల్ సప్లయీస్ డీటీ సత్యనారాయణకు అప్పగించామని ఎస్ఐ వివరించారు.

భవనం పైనుంచి పడి సెంట్రింగ్ కార్మికుడి మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం వెలుగుమట్ల గుట్ట సమీపాన నిర్మాణంలో ఉన్న ఒక ప్రైవేట్ కాలేజీ భవనం పైనుంచి పడడంతో సెంట్రింగ్ కార్మికుడు చిర్రా వీరన్న(40) మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ములకలపల్లికి చెందిన వీరన్న కొంతకాలంగా ఖమ్మంలోని యూపీహెచ్ కాలనీలో అద్దెకు ఉంటూ సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. రోజులాగే శనివారం వెళ్లిన వీరన్న ఐదో అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య వీరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. కాగా, వీరన్నకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

డాబా పైనుంచి పడిన మహిళ...

ఖమ్మం క్రైం: డాబాపై శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిన మహిళ మృతి చెందింది. ఖమ్మం సారథినగర్‌కు చెందిన కొండూరు నాగమణి(45) శనివారం ఇంటి డాబాపై శుభ్రం చేస్తోంది. ఈక్రమాన డాబాకు పిట్టగోడ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు ఖమ్మం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...

కేటీఆర్ ఎప్పుడు జైలుకు పోతాడో చిలక జోస్యం చెప్ప

- మాజీ మంత్రి ఎర్రబెల్లి వ్యాఖ్యలపై విప్ ఆది శ్రీనివాస్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: నలభై ఏళ్ల రాజకీయ చరిత్ర అని గొప్పలు చెప్పుకునే బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చిన్న అమ్మాయి చేతిలో చిత్తు చిత్తుగా ఓడిపోయినా సిగ్గు రాలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయన చిలకజోస్యం చెప్పుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందంటూ ఎర్రబెల్లి చెప్పిన మాటలు చిలుక జోస్యం లాగానే ఉన్నాయని, ఆయనకు నిజంగా జ్యోతిషం తెలిస్తే ఫామ్‌హౌస్‌లో పడుకున్న కేసీఆర్ ఎప్పుడు లేస్తాడో, ఫార్ములా ఈ–రేసులో కేటీఆర్ ఎప్పుడు అరెస్టు అవుతాడో చెప్పాలని శ్రీనివాస్ హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల గురించి ఆలోచించాల్సిన అవసరం ఎర్రబెల్లికి లేదని, ఇప్పటికే ఆ పార్టీ నుంచి 10 మంది వెళ్లిపోగా మిగిలిన వారిని కాపాడుకోవాలని సూచించారు. సీఎం వ్యాఖ్యలను బండి సంజయ్ వక్రీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 18, 19 తేదీల్లో నిరసన

- 9 వామపక్ష పార్టీల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి, సంపన్నులకు రాయితీలు పెంచడం ద్వారా సామాన్యులకు తీరని ద్రోహం చేసిందని తొమ్మిది వామపక్ష పార్టీలు విమర్శించాయి. ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ అఖిలభారత వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 18, 19 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వామపక్ష పార్టీల నేతలు జాన్ వెస్లీ (సీపీఎం), కూనంనేని సాంబశివరావు (సీపీఐ), పోటు రంగారావు (సీపీఎం–ఎంఎల్) మాస్‌లైన్, గాదగోని రవి (ఎంసీపీఐ–యూ), సాదినేని వెంకటేశ్వర్‌రావు (సీపీఐ–ఎంఎల్ న్యూ డెమోక్రసీ), జానకిరాములు (రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ), సీహెచ్ మురహరి (ఎస్‌యూసీఐ–సీ), రమేశ్ రాజా (సీపీఐ–ఎంఎల్ లిబరేషన్), బి.సురేందర్ రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్) శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ కల్పించి, బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐని ఉపసంహరించాలనే పలు డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు.

భయపెడుతున్న జీబీ సిండ్రోమ్



బాధితుల్లో కాళ్ల నుంచి మెడ దాకా క్రమంగా అచేతనం ● పరిశుభ్రమైన నీరు, ఆహారమే ముందు జాగ్రత్తలు

సాక్షి ఫ్యామిలీ హెల్త్ డెస్క్

గులియన్ బ్యారి సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి వేగంగా విస్తరిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి లక్షణాలేమిటి? దీని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలను ప్రజలు శోధిస్తున్నారు. కలుషిత నీరు, ఆహారం తీసుకునే వారిలోనే జీబీఎస్ అధికంగా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్తున్నారు.

జీబీ సిండ్రోమ్ లక్షణాలు

- ఏదైనా వైరల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సోకిన తర్వాత పోస్ట్ వైరల్ లేదా పోస్ట్ బ్యాక్టీరియల్ వ్యాధిగా కనిపించేదే జీబీఎస్.
- మెదడు నుంచి దేహంలోని ప్రతి భాగానికి ఆదేశాలందించడానికి నరాలపై మైలీన్ అనే పొర ఉంటుంది. యాంటీబాడీస్ ఈ పొరను దెబ్బతీసినప్పుడు మెదడు నుంచి సిగ్నల్స్ అందక అవయవాలు అచేతనమవుతాయి.
- మొదట కాళ్లు చచ్చుబడిపోతాయి. క్రమంగా దేహమంతా అచేతనమవుతుంది. గొంతు కండరాలు అచేతనమైతే రోగి మాట్లాడలేడు. మింగడమూ కష్టమవుతుంది. ముఖంలోని కండరాలు అచేతనమైతే కళ్లు కూడా మూయలేడు.
- ఈ ప్రక్రియ ఛాతీ కండరాలు, ఊపిరితిత్తులను పని చేయించే డయాఫ్రమ్ కండరాల వరకు వెళ్లినప్పుడు ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. ఆ స్థితికి వచ్చిన బాధితులు మృతి చెందే అవకాశం ఉంది.
- గుండె స్పందనలు వేగంగా లేదా మెల్లగా మారడం, బీపీ హెచ్చు తగ్గులకు గురికావడం, ముఖం నుంచి వేడి ఆవిర్లు వస్తున్నట్లు అనిపించడం, బాగా చెమటలు పట్టడం జరగవచ్చు. వ్యాధి మొదలయ్యాక 7 నుంచి 14 రోజులపాటు తీవ్రం వస్తుంది. మైలీన్ పొర మళ్లీ యథాస్థితికి వస్తే బాధితులు క్రమంగా కోలుకుంటారు. ఆ ప్రక్రియ రోజుల వ్యవధి నుంచి ఆరు నెలలలోగా జరగవచ్చు.
- శరీరంలో పొటాషియం లేదా కాల్షియం పాళ్లు తగ్గినా జీబీఎస్ లక్షణాలే కనిపిస్తాయి. అయితే అవి భర్తీ కాగానే అచేతనత్వం తగ్గిపోతుంది. కాబట్టి జీబీ సిండ్రోమ్ నిర్ధారణ చాలా స్పష్టంగా జరగాలి.
- కలుషిత నీరు, ఆహారమే జీబీఎస్ రావటానికి ప్రధాన కారణమని గుర్తించారు.

తక్కువ ఖర్చుతో చికిత్స

ఈ జబ్బులో రోగి తన రోజువారీ పనులను సొంతంగా చేసుకోలేని పరిస్థితికి చేరుకుంటే వారికి తగిన మోతాదులో ఐదు రోజులపాటు ఇమ్యూనో గ్లోబ్యులిన్ ఇంజెక్షన్లు ఇస్తారు. ఇవి దేహంలో మైలీన్ పొరను ధ్వంసం చేసే యాంటీబాడీస్‌ను బ్లాక్ చేయడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దుతాయి. మరో పద్ధతిలో రోగి బరువును బట్టి ప్రతి కిలోగ్రాముకు 250 ఎంఎల్ ప్లాస్మాను రక్తం నుంచి తొలగిస్తారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కలుషితమైన నీరు, ఆహారం వాడకపోవడం మేలు.



–డాక్టర్ బి. చంద్ర శేఖర్‌రెడ్డి, సీనియర్ న్యూరో ఫిజీషియన్

బడ్జెట్ కసరత్తు ముమ్మరం

- ఇప్పటికే ప్రభుత్వానికి చేరిన అన్ని శాఖల అంచనాలు
- శాఖల వారీగా సమీక్షలు జరుపుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ రూపకల్పన కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన నిధులను అన్ని ప్రభుత్వ శాఖలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆర్థిక శాఖకు పంపాయి. ఈ ప్రతిపాదనలపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో బడ్జెట్ తయారీ కోసం శాఖల వారీగా సమీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటికే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, ఆర్ అండ్ బీ, బీసీ సంక్షేమం, రవాణా, వ్యవసాయం, జౌళి శాఖలపై సమీక్షలు పూర్తికాగా, శనివారం రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై భట్టి విక్రమార్క.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బడ్జెట్ రూపకల్పన, ప్రభుత్వ ప్రాధాన్యతల గురించి మంత్రులు అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిగిలిన శాఖల అంచనాలపై కూడా వచ్చే వారం నాటికి సమీక్షలు పూర్తవుతాయని, అనంతరం బడ్జెట్ తయారీలో ఆర్థిక శాఖ పూర్తిస్థాయిలో నిమగ్నమవుతుందని తెలుస్తోంది. మార్చి మొదటి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించిన ప్రభుత్వం ఆ సమావేశాల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. కాగా, ఈసారి బడ్జెట్ పరిమాణం పెరుగుతుందా, తగ్గుతుందా అన్న దానిపై ఆర్థిక శాఖ వర్గాలు తర్జనభర్జనలు పడుతున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన సాయం విషయంలో ఆశించిన మేర నిధులు రాకపోవడం, ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో సొంత ఆదాయ రాబడులపైనే దృష్టి సారించి బడ్జెట్‌ను రూపొందించాల్సి ఉంటుందని, బడ్జెట్ పరిమాణంపై రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను బట్టి నిర్ణయం తీసుకుంటామని ఆర్థిక శాఖ వర్గాలు చెప్పాయి.

ఆ జిల్లాల్లో ఇందిరమ్మ నిర్మాణాలు

▶ మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, సమాచార శాఖ కమిషనర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

భూములపై నిరంతర పర్యవేక్షణ

రెవెన్యూ శాఖ సమీక్షలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ప్రభుత్వ భూములపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వం చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కోర్టు కేసుల్లో ఉన్న భూములను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని కోరారు. సినిమా రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు సమాజ వికాసానికి దోహదపడే విధంగా లఘుచిత్రాలను తీసుకువచ్చేందుకు నిధులు కేటాయిస్తామని చెప్పారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల చుట్టూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మాణాలపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్‌లోని మధ్య తరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ఇళ్ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపడం ద్వారా భూసేకరణ చేసుకోవాలని సూచించారు. ఇక, రాష్ట్రంలో భూముల డిజిటల్ సర్వేకు సంబంధించి అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాల జాబితాను సేకరించాలని, ప్రతి నెలా ఈ అద్దెలను చెల్లించేలా ఆర్థిక శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహకాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

‘గురి’ తప్పిన గురుకులాలు

▶ మొదటి పేజీ తరువాయి

చేపడుతోంది. మైనార్టీ సొసైటీలోని పాఠశాలలు మినహా మిగిలిన నాలుగు సొసైటీల్లోని 643 పాఠశాలల్లో ఐదోతరగతిలో 51,924 సీట్లు ఉన్నాయి. వీటిలో ఐదోతరగతి ప్రవేశాలకు గతేడాది డిసెంబర్ 21 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 80 వేలలోపే దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాదితో పోల్చితే ఇవి దాదాపు 40 వేలు తక్కువ. ఈ నెల 23వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించేందుకు ఎస్సీ గురుకుల సొసైటీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం నమోదైన దరఖాస్తుల ప్రకారం ఒక్క సీటు కోసం సగటున 1.6 మంది పోటీ పడుతున్నారు. గురుకుల పాఠశాల ప్రవేశం కోసం గతంలో విపరీతమైన డిమాండ్ ఉండేది. ఒక్కో సీటు కోసం సగటున నలుగురు విద్యార్థులు పోటీపడేవారు. గత ఏడాది కాలంగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు భారీగా పెరగటమే డిమాండ్ తగ్గటానికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సంవత్సరాలవారీగా దాదాపుగా సీట్లు, దరఖాస్తులు

సంవత్సరం	మొత్తం సీట్లు	దరఖాస్తులు
2020–21	48,000	1,68,000
2022–23	48,000	1,50,000
2023–24	48,000	1,32,000
2024–25	51,000	1,20,000
2025–26	51,000	80,000

సొసైటీల వారీగా పాఠశాలలు, ఐదో తరగతిలో సీట్లు ఇలా..

సొసైటీ	స్కూళ్లు	సీట్లు
ఎస్సీ	232	18,560
ఎస్టీ	82	6,560
బీసీ	294	23,680
జనరల్	35	3,124
మొత్తం	643	51,924

సీపీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి గిరిజన ఉపాధ్యాయ సంఘం మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ బలపరిచిన అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డికి తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు అభ్యర్థి ఇన్నారెడ్డి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌లను.. శనివారం తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ రాథోడ్ తదితరులు కలిసి మద్దతు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, ఓపీఎస్ సాధనే లక్ష్యంగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో సీపీఎస్ అభ్యర్థి విజయం సాధించడం ద్వారా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లవచ్చని అభిప్రాయపడ్డారు.

‘స్థానిక’ పోరులో కాంగ్రెస్ మిత్రపక్షాలతో కలవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సాక్షి, హైదరాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మిత్రపక్షాలతో పరస్పర అవగాహన విషయంలో కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని చాటుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శత్రువును ఎదుర్కొనేందుకు కలసి పనిచేయాల్సిన అవసరాన్ని మొన్నటి ఢిల్లీ ఎన్నికలు నిరూపించాయన్నారు. కాంగ్రెస్, ఆప్ పార్టీల స్వయంకృతాపరాధం వల్లనే ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైతే అప్పులు చేసైనా.. ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉచితాల కారణంగా వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని, ఇతర పనులకు కూడా ఎవ్వరూ రావడం లేదని మేధావులు, న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులనే సంక్షేమ పథకాల రూపంలో తిరిగి వారికి ఇస్తున్నారు తప్ప ఉచితంగా కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణనను దేశవ్యాప్తంగా చేపట్టాలన్నారు.

జిల్లా వార్తలు

గిరిజన ప్రాంత అభివృద్ధికి పాటుపడాలి

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్



బృందం సభ్యులతో మాట్లాడుతున్న పీఓ

భద్రాచలం: ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ప్రజల అభివృద్ధికి నిధులు కేటాయించాలని భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ బృందానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశాలతో భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ బృందం జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో వసతుల కల్పనకు అధ్యయనం చేపట్టింది. అందులో భాగంగా భద్రాచలంలో పీఓను వారు కలవగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన కుటుంబాలు, వారి పిల్లలకు మెరుగైన వైద్యం, విద్య, ఇతర వసతులను సమకూర్చడానికి సీఎస్సార్ ద్వారా నిధులు కేటాయించాలని కోరారు. కాగా, బృందం సభ్యులు గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, పీహెచ్‌సీలు, భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రి, ఐటీడీఏలోని ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ జీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు అభినందనీయం

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని నిరుపేద గిరిజనులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయించడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. భద్రాచలంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో మూడు నెలల పాటు నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరం ముగిసిన సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల విద్యార్థులు, రెడ్ క్రాస్, లయన్స్‌క్లబ్ సభ్యుల సహకారంతో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స చేయించిన నేపథ్యాన ఇలాంటి సేవలు కొనసాగించాలని సూచించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకవర్గం సభ్యుడు శ్రీనివాసరావు, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డాక్టర్ చైతన్య, సూర్యనారాయణ, సిద్ధులు, సంజీవరావు, శ్రీనివాసరెడ్డి, కామేశ్వరరావు, వెంకటపుల్లయ్య, స్వామి పాల్గొన్నారు.

18 నుంచి మల్లెమడుగు రైల్వే గేట్ మూసివేత

ఖమ్మంరాపర్తినగర్: డోర్నకల్ – ఖమ్మం రైల్వే మార్గంలో మూడో లైన్ పనులు చేపడుతున్నందున మల్లెమడుగు వద్ద గేట్‌ను ఈ నెల 18 నుంచి మార్చి 9వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు.

శత శాతమే లక్ష్యంగా..

- ఆస్తి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కార్యాచరణ
- 50 రోజుల్లో లక్ష్యాన్ని చేరేలా ప్రత్యేక బృందాలు



కేఎంసీలో ఆర్ఐలు, బిల్ కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తున్న ఆర్ఓ శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుతున్న తరుణాన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. వంద శాతం పన్నులు రాబట్టేలా అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. 2023–24 ఏడాదిలో వచ్చిన ఆదాయానికి అదనంగా 2024–25 ఏడాది లక్ష్యాలను పెంచి పుర, నగర పాలకసంస్థల్లో వసూళ్లు ప్రారంభించారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఎర్లీ బర్డ్ పథకం కొంత మేర వసూలైనా, ఆ తర్వాత పలు కార్యక్రమాలు, కారణాలతో నిర్లిప్తత నెలకొంది. మళ్లీ ఇప్పుడు ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తుండడంతో అధికారులు పన్నుల వసూళ్లపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించారు.

పన్నులు వసూలైతేనే..

స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో జరిగే అభివృద్ధి ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్స్‌పైనే ఆధారపడి ఉంటుంది. అయితే, ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలు లక్ష్యాలను చేరితే ఆయా మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే నిధుల్లో వాటా పెరుగుతుంది. ప్రధానంగా 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులు, స్వచ్ఛభారత్, అమృత్ పథకాల నిధుల కేటాయింపు, ఇతర నిధులను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు వచ్చే పన్నుల ఆదాయానికి అనుగుణంగా కేటాయిస్తుంటారు. దీంతో ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు లక్ష్యాలకు అనుగుణంగా పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది.

50 రోజులే గడువు..

2024–25 ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఇంకా 50 రోజుల గడువే ఉంది. దీంతో ఇటు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకున్నారు. మార్చి 31వ తేదీ నాటికి పన్నుల వసూళ్లను నిరంతరాయంగా కొనసాగిస్తూ వంద శాతం లక్ష్యాలను చేరుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రజలకు అవగాహన కల్పించేలా క్షేత్ర స్థాయికి వెళ్తున్నారు.

కేఎంసీలో ప్రత్యేకంగా..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పన్నుల వసూళ్లపై కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.36.74 కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.19.21 కోట్లు వసూళ్లయ్యాయి. ఇందులో వేగం పెంచేలా వారం రోజులుగా ఖమ్మంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వాణిజ్య ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ ద్వారా పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచే బిల్లు కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రజలను కలుస్తున్నారు. మరోపక్క బకాయిదారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు పన్నులు చెల్లించాలని ఇంటి యజమానుల ఫోన్ నంబర్లకు మెస్సేజ్‌లు పంపిస్తున్నారు. అంతేకాక ప్రధాన కూడళ్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ఆటోలకు మైక్‌లు బిగించి పన్ను చెల్లించాలంటూ ప్రచారం చేయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల వారీగా పన్ను లక్ష్యం, వసూళ్ల వివరాలు (రూ.కోట్లల్లో)

కార్పొరేషన్/ మున్సిపాలిటీ	పన్ను లక్ష్యం	వసూలు చేసింది	బకాయిలు
ఖమ్మం	36.74	19.21	17.52
మధిర	2.55	1.25	1.30
సత్తుపల్లి	4.88	2.83	2.05
వైరా	4.25	1.23	3.02
పాల్వంచ	6.32	2.77	3.55
కొత్తగూడెం	7.88	3.41	4.47
ఇల్లెందు	2.69	1.48	1.21
మణుగూరు	2.40	1.01	1.39



పన్నులు చెల్లించాలని ప్రచారం చేస్తున్న దృశ్యం

వసూళ్లలో వేగం పెంచాం..

కమిషనర్ అభిషేక్ సూచనలతో పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ప్రతిరోజు ఉదయం 8గంటలకే ఆర్ఐలు, బిల్లు కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు తమకు కేటాయించిన డివిజన్లకు వెళ్లి వసూలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మార్చి 31 నాటికి లక్ష్యాలకు అనుగుణంగా పన్నులను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

– జి.శ్రీనివాస్, ఆర్ఓ, కేఎంసీ

నీటి యాజమాన్యమే కీలకం

- మామిడిలో సమగ్ర యాజమాన్య విధానాలతో ఉత్తమ దిగుబడి
- సిఫారసు మేర ఎరువులు వినియోగిస్తే కాయ నాణ్యత
- ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్ సూచనలు



ఎం.వీ.మధుసూదన్

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలోనే మామిడి సాగుకు ఖమ్మం జిల్లా పెట్టింది పేరు. జిల్లాలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, రఘునాథపాలెం, చింతకానితదితర మండలాల్లో 32,105 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. నేల రకాలు, వాతావరణం ఆధారంగా బంగినపల్లి, దోశేరి, హిమాయత్, తోతపురి, రసాల రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఫలరాజుగా పిలిచే మామిడి ప్రస్తుతం పూత, కాత దశలో ఉంది. ఈ దశలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తేనే మెరుగైన దిగుబడి వస్తుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ వెల్లడించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

తగిన మోతాదులో నీరు

మామిడి పూత నుంచి పిందె కట్టే దశలో ఉన్నందున సరైన మోతాదులో నీరు ఇవ్వాలి. అలాకాకుండా ఎక్కువ ఇస్తే తామర పురుగు, తేనె మంచు పురుగు, బూడిద రోగం సమస్యలు పెరుగుతాయి. 8–15 రోజుల వ్యవధిలో భూముల ఆధారంగా నీటి తడులు ఇవ్వాలి. భూమిలో తేమ ఎక్కువగా ఉంటే మామిడి తోటలో గడ్డి దోమ పెరిగినా ఎలాంటి హాని కలగదు. ఇదే సమయాన నిక్కుడు పురుగు (సెమీ లూపర్), తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద రోగం, పక్షి కన్ను తెగుళ్లు ఆశిస్తాయి. వీటి నివారణకు 500 లీటర్ల నీటిలో ఇమిడక్లోప్రిడ్ + ఫిప్రోనేల్, 100 గ్రాములు + ఏమమెక్టిన్ బెంజోయేట్ 250 గ్రాములు + మారినో లీటర్ + బోరాన్(20) 500 గ్రాములు + హెక్సాకొనజోల్ లీటర్ కలిపి చెట్టు తడిసేలా పిచికారీ చేయాలి. తద్వారా తెగుళ్ల బెడద తగ్గడంతో పాటు పిందె బాగుంటుంది.



పూత, పిందె దశలో మామిడి



పూత, కాత దశలో ఉన్న మామిడి చెట్టు

ఆ మందులు మళ్లీ వద్దు

చీడపీడల నివారణకు ఒకసారి చల్లిన మందుల ను మరోసారి చల్లకూడదు. అలాచేస్తే పురుగులు మందులను తట్టుకొనే శక్తి పెంచుకుంటాయి. అలాగే, సిఫారసు చేసిన మందులను తగిన మోతాదులో వినియోగిస్తే ఫలితం ఉంటుంది.

హార్మోన్స్ లోపం

మామిడి చెట్లకు నీటి ఎద్దడి, హార్మోన్లు, ఇతర పోషక లోపంతో పిందెలు రాలిపోతుంటాయి. పిందెలు ఏర్పడే దశ, తిరిగి 15–20 రోజుల వ్యవధిలో అవకాశమున్న చోట చెట్లకు 2–3 నీటి తడులిస్తే మంచిది. తద్వారా పిందె రాలడం తగ్గిపోయి కాయలు పెద్ద సైజులో నాణ్యతగా ఉంటాయి. నీటి సౌకర్యం లేనిచోట చెట్లకు ట్యాంకర్ల ద్వారా సమకూర్చినప్పటికీ ఖర్చుకు మించి ఆదాయం వస్తుంది.

నాణ్యమైన కాయల కోసం..

మామిడి పిందెలు పెరిగే దశలో ప్రత్యేక జాగ్రత్తలు వహించాలి. చెట్ల సైజ్ ఆధారంగా 500–100 గ్రాముల యూరియా, 500–1000 గ్రాముల పొటాష్ ఎరువులను 2 కిలోల వేపపిండితో కలిపి ప్రతీ చెట్టుకూ వేయడం వల్ల కాయలు పెద్దసైజ్‌కు పెరుగుతాయి.

మావోయిస్టు అరెస్ట్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో ఓ మావోయిస్టును పోలీసులు అరెస్ట్ చేశారు. చింతనూరు పోలీస్ స్టేషన్ నుంచి బలగాలు శనివారం కూంబింగ్‌కు వెళ్లగా నర్సాపురం సమీపాన ఓ వ్యక్తి వీరిని చూసి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో వెంబడిస్తూ మల్లెవాగు నాలా వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా పోడియం భీమాగా తేలింది. కొన్నాళ్లుగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న ఆయన నుంచి నాలుగు జిలెటిన్ స్టిక్స్, వైర్, కరపత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



పట్టుబడిన భీమాతో పోలీసులు

‘విభజన’హామీలు అమలు చేయాలి

ఇల్లెందు: ఏపీ – తెలంగాణ విభజన సమయాన ఇచ్చిన హామీలను విస్మరించడం సరికాదని ఇల్లెందు అఖిలపక్షం నాయకులు పేర్కొన్నారు. ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో శనివారం సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకుడు గోపగాని శంకర్‌రావు మాట్లాడారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ వెంటనే నిర్మిస్తామన్న బీజేపీ ఆ హామీని నెరవేర్చాలన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రాన్ని ఒప్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు ఆలేటి కిరణ్, ఎస్ఏ నబీ, దేవరకొండ శంకర్, తుపాకుల నాగేశ్వరరావు, రాసుద్దీన్, ముద్రగడ వంశీ, సీహెచ్ రమేశ్, రాంసింగ్, గుండాల వెంకన్న, పృథ్వీ, మోహన్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు